# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 26 -

## - కృష్‌తోనాస్తి దుస్చ్రితం -

**విక్రమార్కుడు,** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు. ‘విక్రా! నీకు శ్రమకలుగకుండా వుండేందుకు మరో కథ చెబుతాను. విను!‘ - అని బేతాళుడు ప్రారంభించాడు.

"అగాధాకుట్టి అని వొక స్త్రీ నిర్మాత వుంది. ఆమె పుంఖానుపుంఖాలుగా సినిమాలు తీసి, తీసిన సినిమాలు ఏవీ సరిగా ఆడక బాగా నష్టపోయింది. ఆమె పెళ్లి చేసుకోలేదు. కానీ ఆమెకు హడావుడి శర్మ అనే పెర్మినెంట్ బాయ్ ఫ్రెండున్నాడు. అతను కోనసీమలో కోట్ల ఆస్తిపరుడు. ఒకరోజు అగాధా, హడావుడి శర్మని అడిగింది - ‘మై డియ్యరూ, నువ్వెప్పుడొచ్చినా అడావుడిగా గడిపేసి ఎల్లిపోతావు. నువ్విచ్చేదంతా సినేమాలకే యెట్టాను. కలిసిరాటం లా. ఇలా సీటికీ మాటికీ సిల్లరివ్వకుండా, సిరకాలం కలిసుందాం. నన్ను పెల్లాడై సెటిలయిపోదాం -‘ అంది.

"ఓసి పిచ్చి మొవమా! ప్రతిసారీ నేను నీకిచ్చే డబ్బు నువ్విచ్చే సుఖానికి కాదు.. సుఖానికి సుఖం ఎప్పటికప్పుడు సరితూగిపోతోంది. ఆ డబ్బు నువ్వు నన్ను పెర్మనెంటుగా తగులుకోకుండా వుండేందుకే యిస్తున్నా. ఆ మాటకొస్తే యీ ప్రపంచం అంతటా చిలక్కొట్టుగాళ్లు చిలుకలకి డబ్బు అందుకే యిస్తారు. అంచేత మనం యిలాగే కంటిన్యూ చేద్దాం. నీక్కావల్సినంత డబ్బిస్తాను. ఈసారి మాంఛి హిట్ సినిమా ప్లస్ వుత్తమ చిత్రం తియ్యి.-" అని ధైర్యం చెప్పాడు హడావుడి శర్మ.

"అలా తీసే డవిర్రెటు దొరకాలిగా మనకి?? " అడిగింది అగాధాకుట్టి.

"వున్నాడు అగాధా! వున్నాడు. రేపు నీకో చిత్రం చూపిస్తాను. చూస్తే నీకే తెలుస్తుంది. ఆ డైరెక్టర్ నీకు యెస్సంటే నీ రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.-" అని హడావుడి శర్మ హామీ యిచ్చాడు...

"స్సరే మరి. అదీ సూద్దాం" అంది అగాధా.

ఆ మర్నాడు హడావుడి, అగాధాకి ‘గౌతమిపుత్ర శాతకర్ణి‘ చూపించాడు.

సినిమా చూసి అగాధా ఆశ్చర్యానందాలతో అవాక్కయింది. కాసేపటికి తేరుకుని - "అడావుడీ, అదుర్‌బుతం! యారో యిరగదీసాడు. ఆర్‌టెస్టోల్లు, క్రూ అంతా అరగదీసి మెరుగెట్టారు. సీన్లు పగల్దీసాడు. యిక మూసిక్కే మూసిక్కు! లిరికులన్నీ సెవక్కులు. డవిలాగులు సమత్కారాలు సెరుకురసం వాగులు. అన్నిటికీ మించి యింకో మంసిపని సేసాడు -" అంది.

"ఏవిటది!" అడిగాడు హడావుడిశర్మ.

"సివర్లో గిరీకు పిల్లసేత అవిటం సాంగెయ్యలేదు."

"అవును కథ ఔచిత్యం కంచికి వెళ్ళిపోతుందని"

"అంతేకాదు అడావుడీ! ఆ పిల్లకి పిరల్లేవు. ఇంకా ఆ పిల్లకేకాదు, నారుతు హీరోయిన్ గుంటలందరికీ జగనాలు గగనం."

"కరెక్ట్! అందుకే సినిమాలో వందల వందల గుర్రాల్ని వెనుక నుంచి చూపించి దర్శకుడు ఆ లోటు తీర్చాడు."

"అద్సరే అడావుడీ! మరి డవిలాగులు వొక్క బుర్రతో యెలా రాసాడో నా బుర్రకి తోసటంలేదు." అంది అగాధాకుట్టి.

- అదీ విషయం, విక్రా! అయితే అగాధాకి వచ్చిన డౌటే నాకూ వచ్చింది. గౌతమిపుత్ర శాతకర్ణి చిత్రానికి అంత గొప్పగా ఆ యువ రచయిత తన వొక్క బుర్రతో డైలాగులు ఎలా తొడిగాడు? ఈ ప్రశ్నకి నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి చెక్కలయిపోతుంది-"

- అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు, "బేతాళా! గౌతమిపుత్ర శాతకర్ణి చిత్రానికి డైలాగ్స్ ఆ యువ రచయిత తన వొక్క బుర్రతో రాయలేదు. నిజానికి రెండు బుర్రలతో రాసాడు. ఒకటి - పుట్టుకతో అతని మాతృశ్రీ ప్రసాదించిన బుర్ర - రెండోది - అతడి పితృమూర్తి ప్రసరించిన యింటిపేరు - బుర్రా."అంతా కృష్ కృషి.

**'కాంక్షన్తః కర్మణాంసిద్ధిం**

**యజన్త ఇహ దేవతాః!**

**క్షిప్రం హిమానుషేలోకే**

**సిద్ధిర్భవతి కర్మజా||**

- మనుషులు అనగా ప్రేక్షకులు కోరినవన్నీ మంచిగా శాశ్వతముగా నుండునట్లు యిచ్చువాడను నేను. కౌబోయ్ దర్శకుల చిత్రములు వెంటనే లభించిననూ వెనువెంటనే నశించు - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీ కృష్ణభగవానుడు -" అని సమాధానం చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు వెంటనే యెగిరి వెళ్లి తన తల్లి వంటి చెట్టు చంకెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments